క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్: మండల పరిధి చల్లంపల్లి గ్రామానికి చెందిన పెద్దమోని యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, రాధా కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ శనివారం పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. అదే విధంగా యువ నాయకుడు శివయాదవ్ రూ.4500లను అందజేశారు.

మైసిగండి మైసమ్మ సన్నిధిలో నేతల పూజలు



పూజా కార్యక్రమంలో భక్తులు

ఆమనగల్లు: కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని శనివారం మాజీ ఎంపీపీ, యాదవసంఘం రాష్ట్ర నాయకుడు సీఎల్.శ్రీనివాస్‌యాదవ్ సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు వెంకటేశ్, తలకొండపల్లి మండల అధ్యక్షుడు శంకర్, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యుడు ముజుబుర్ రెహ్మాన్, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్‌యాదవ్, నాయకులు బాలస్వామి, శివకుమార్, గణేశ్, మహేశ్‌నేత, జగన్, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల అందజేత



దాత అందజేసిన బ్యాగులతో చిన్నారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు దాతలు సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ కోరారు. ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కేశ్యానాయక్ ఫౌండేషన్ సపోర్టింగ్ హ్యాండ్స్ ఫర్ నీడ్స్ ఆధ్వర్యంలో ఎయిర్‌ఫోర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పోర్ట్ బ్లేయిర్ సీనియర్ మేనేజర్ సూర్యా నాయక్ సొంత డబ్బులతో స్కూల్ బ్యాగులు, స్టేషనరిని 35 మంది విద్యార్థులకు అందజేశారు. అనంతరం సూర్యా నాయక్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు విజయేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు



ఎస్‌ఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ డిమాండ్ చేశారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రిపై.. కేసీఆర్, కేటీఆర్ మెప్పు పొందడానికి కౌశిక్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారం, రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, మండల అధ్యక్షుడు రవి, పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు ప్రవీణ్‌గౌడ్, ఆకాశ్, మల్లేశ్, సందీప్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ కల్యాణోత్సవం

ఇబ్రహీంపట్నం: బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయంలో కల్యాణోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకురాలు దూసరి వరమ్మ శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పుట్టకమ్మి, సోమవారం సాయంత్రం 4 గంటలకు పుట్ట బంగారం తెస్తామని చెప్పారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు గంగ స్నానం, బోనాలు ఎక్కించడం జరుగుతుందన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఎల్లమ్మ కల్యాణం, 11 గంటలకు పట్నాలు తొక్కే కార్యక్రమం ఉందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంటకు అన్నదానం ఉందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.



ఇంజాపూర్ సాయినాథ్ కాలనీ రోడ్డు దుస్థితి



తుర్కయంజాల్ సాయి పంచవటి కాలనీలో దిగబడిన కారు

అడుగు పెట్టలేం..

- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- బురదమయంగా కాలనీల రహదారులు
- డ్రైనేజీ గుంతల్లో కూరుకుపోతున్న వాహనాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

తుర్కయంజాల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పురపాలక సంఘం పరిధి కాలనీల అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. బురదమయంగా మారి.. అడుగు పెట్టలేక.. బండ్లు నడపలేని దుస్థితికి చేరుకున్నాయి. దానికి తోడు గోతులు ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా డ్రైనేజీ, తాగునీటి పైప్ లైన్‌ల కోసం తవ్విన ప్రాంతాల్లో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. వాటిల్లో నీరు నిలిచి, వాహనదారులను ప్రమాదం బారిన పడేలా చేస్తున్నాయి.

గోతులు సరిగా పూడ్చక

▲ ఇంజాపూర్‌లోని 24వ వార్డు సాయినాథ్, శ్రీరంగాపురం కాలనీల్లో ఇటీవల అంతర్గత డ్రైనేజీ లైన్‌ను వేశారు. ఆ సమయంలో రోడ్డును తవ్వారు. ఇక్కడ భూమి దిగబడే స్వభావం కలిగి ఉండటంతో.. కురుస్తున్న వర్షాలతో రోడ్డు దెబ్బతిన్నది. బంక మట్టి కావడంతో వాహనదారులు, బాటసారులు జారి పడుతున్నారు.

▲ తుర్కయంజాల్‌లోని 10వ వార్డులో సాయి పంచవటి, జర్నలిస్టు కాలనీల్లో డ్రైనేజీ లైన్ల కోసం రోడ్లను తవ్వారు. అనంతరం సరిగా మట్టిపోసి పూడ్చకపోవడంతో అక్కడ ఓ గొయ్యి ఏర్పడింది. మొత్తం బురద మయంగా మారింది. దీంతో అందులో వాహనాలు దిగబడుతున్నాయి. ఇటీవల ఓ పాఠశాల బస్సు కూరుకుపోయింది. బురదలో కూరుకున్న వాహనాలను తీయడానికి జేసీబీ సహాయం తీసుకోవాల్సి వస్తోంది.

▲ మునగనూర్‌లోని అంజనాపురి, వేద విద్యానగర్, టెలిఫోన్ కాలనీ, ఎస్‌బీహెచ్ కాలనీ, రామాంజనేయ కాలనీలోని అతంర్గత రోడ్లపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఇంజాపూర్‌లోని వేంకటేశ్వర, తుల్జాభవానీ, సాయిదయ కాలనీ రోడ్లు రూపం కోల్పోయాయి.

> **అంచనాలు వేసి..**
>
> పురపాలికలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారింది వాస్తవమే. ఇప్పటికే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి చొరవతో పలు రహదారుల నిర్మాణ పనులను పూర్తి చేశాము. మిగతా వాటి నిర్మాణానికి అంచనాలు రూపొందించి, టెండర్లను పిలవడానికి సిద్ధంగా ఉన్నాయి.
>
> – అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు



విద్యార్థినులతో అధ్యాపక, ఉపాధ్యాయ బృందం

యాచారం: క్రమశిక్షణతో చదివి, ఉన్నత శిఖరాలను అందుకోవాలని అధ్యాపక బృందం సభ్యులు అన్నారు. శనివారం యాచారం మండలం నందివనపర్తి ఉన్నత పాఠశాలలో ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో బాలిక సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత చదువుల వలన కలిగే ప్రయోజనాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలపై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏవీఆర్ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు కిషన్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని వినతి

మీర్‌పేట: కాలనీ అవసరాల కోసం వదిలిన స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని జిల్లెలగూడ సాయినగర్ కాలనీవాసులు శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. 43వ డివిజన్ సాయినగర్‌లో ప్రజల అవసరాల కోసం వదిలిన స్థలంలో.. ఓ వ్యక్తి, తన వద్ద ఇందిరమ్మ పట్టా ఉందని పేర్కొంటూ.. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు.. ఇది ప్రజా స్థలమని, ఎవరికీ పట్టా మంజూరు చేయలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే నిర్మాణాన్ని నిలిపివేయాలని వారు కమిషనర్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జి.కృష్ణ, శోభారాణి, శాంతమ్మ, బాబురావు, జంగయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా కాటమయ్య బోనాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లలో కాటమయ్య బోనాల పండుగ శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గౌడకులస్తులు నెత్తిన బోనంతో డప్పుచప్పుళ్ల నడుమ, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పునకాలతో ఊరేగింపుగా.. కంఠమహేశ్వర స్వామి సన్నిధికి చేరుకున్నారు. అనంతరం స్వామివారికి నైవేద్యంగా బోనం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు సాంబయ్యగౌడ్, రజినికాంత్‌గౌడ్, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో శనివారం సాయంత్రం శ్రీ కంఠ మహేశ్వరస్వామి, పెద్దమ్మతల్లి బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గౌడకులస్తులు కంఠ మహేశ్వర స్వామి దేవాలయంలో, ముదిరాజ్‌లు పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



ఇబ్రహీంపట్నం రూరల్: నెత్తిన బోనంతో భక్తులు

రేషన్ కల నెరవేరింది

- కొనసాగుతున్న కార్డుల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న అర్హులు



ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: రేషన్ కార్డుల(ఆహార భద్రత కార్డులు) కోసం పుష్కర కాలంగా ఎదురు చూసిన వారి కల నెరవేరింది. ఈ మధ్య కాలంలో ప్రతి కుటుంబంలో ఎన్నో మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి. వివాహ అనంతరం ఆడ పడుచులు మెట్టినింటిలో అడుగు పెట్టినవారితో పాటు.. పుట్టుక, గిట్టుట, పేరు, చిరునామా మార్పు ఇలా అనేక మార్పులు జరిగాయి. మార్పులు చేర్పులతో కూడిన కార్డుతో పాటు.. కొత్త రేషన్ కార్డుకోసం అనేకులు ఎదురు చూశారు. ప్రభుత్వ పథకాలే కాదు, ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందాలన్నా, ఆరోగ్య సమస్యలు వచ్చి ఆస్పత్రికి వెళ్లాలన్నా పేదలకు రేషన్ కార్డే ప్రధానం. అలాంటి ఆధారం పంపిణీకి సర్కారు ముహూర్తం ఖరారు చేయడంతో అర్హులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. మరో రెండుమూడు రోజుల్లో యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లో అర్హులకు వారి సమక్షంలోనే అందజేసేందుకు రంగం సిద్ధమైంది.

మండలంలో 1500 కార్డులు

ఇబ్రహీంపట్నం మండలంలో ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలతో పాటు 14 గ్రామాలు ఉన్నాయి. పాత రేషన్ కార్డులు 18,941 ఉండగా, రేషన్ సరుకుల పంపిణీకి 37 దుకాణాలు ఉన్నాయి. కొంత కాలంగా కొత్త కార్డుల కోసం 2100 దరఖాస్తులు అందగా.. తాజాగా అందులో 1500 కుటుంబాలకు కార్డులు మంజూరు అయ్యాయి. పలు కారణాలతో 600 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. పాత కార్డుల్లో 4,951 కొత్త పేర్లను నమోదు చేశారు. 200 పేర్లు ఇంకా నమోదు కాలేదు. పేర్ల తొలగింపులో కేవలం 300లోపు మాత్రమే ఉండటం గమనార్హం. ఇదిలా ఉండగా.. అర్హులు ఎవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇస్తుందని తహసీల్దార్ సునితారెడ్డి తెలిపారు. కొత్తగా మంజూరు అయిన కార్డులను.. క్రమంగా అర్హులకు అందజేయనున్నామని పేర్కొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలి

- మాజీ సీఎస్ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం

మీర్‌పేట: టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు కోర్సులను ఎంపిక చేసుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం సూచించారు. మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల 5వ గ్రాడ్యుయేషన్‌డే వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గ్రాడ్యుయేషన్ పూర్తవగానే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ఉంటూ, తమ చదువు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులకు పట్టాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి, సెక్రటరీ హరినాథ్‌రెడ్డి, కోశాధికారి అమర్‌నాథ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న మాజీ సీఎస్ సుబ్రహ్మణ్యం, తీగల కృష్ణారెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకి గార్డెన్‌లో శనివారం అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు, పక్కా ఇళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం కొత్తగా రేషన్ కార్డులను అందజేస్తున్నామని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఘన విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు అంజయ్య, అజీమ్, వెంకట్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, రఘురాములు, శ్రీనివాస్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- పల్లెల్లో కాషాయ జెండాను ఎగురవేయాలి
- జిల్లా స్థానిక ఎన్నికల ప్రభారీ పాపారావు



కార్గిల్ దివాస్ సందర్భంగా సైనికుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలని, ఆ దిశగా పార్టీ శ్రేణులు పనిచేయాలని జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ప్రభారీ పాపారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయనాయక్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. అందుకే ఆ పార్టీని ప్రజలు నమ్మడం లేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పరిస్థితి అయోమయంగా ఉందని, ప్రత్యామ్నాయంగా ప్రజలు బీజేపీ వైపే చూస్తున్నారని స్పష్టంచేశారు. ప్రధానీ మోదీ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి, పల్లెల్లో కాషాయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేసే వారికే అవకాశం, గుర్తింపు ఉంటుందని, షో చేసే వారికి కాదని చెప్పారు. అనంతరం కార్గిల్ దివాస్ సందర్భంగా వీర సైనికులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములు, బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, యాచారం ఎన్నికల కన్వీనర్ యాదగిరిరెడ్డి, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు నాగని యాదయ్య, జంగయ్యగౌడ్, శ్రీశైలం పాల్గొన్నారు.

యూరియాపై వదంతులు నమ్మొద్దు

కందుకూరు: యూరియా కొరత ఉందంటూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వదంతులు సృష్టిస్తున్నారని, రైతులు నమ్మొద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి జీర్ణించుకోలేని ప్రతిపక్ష నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఇలాంటి ప్రచారాలు నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వం యూరియా సరిపడా సరఫరా చేస్తోందన్నారు. రైతులు గంటల కొద్ది క్యూలైన్లలో యూరియా కోసం నిరీక్షిస్తున్నారని, సోషల్ మీడియాలో విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొని వెళ్లి తగినంత యూరియాను తెచ్చుకోవాలని కోరారు. సీజన్‌కు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు.